సచివాలయం సందర్శన

ప్రజాశక్తి -హుకుంపేట:సచివాలయం సేవల ద్వారా ప్రజలకు దగ్గర అవ్వాలని సర్పంచ్ సోమెలి శాంతకుమారి సూచించారు. మండలంలోని మఠం పంచాయతీలో సచివాలయం సిబ్బంది, గ్రామ వాలంటీలతో బుధవారం సమావేశం ఏర్పాటు చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ, ప్రభుత్వ అందిస్తున్న ప్రతి సంక్షేమ పథకాలను ప్రజలకు అందజేయాలని సూచించారు. పంచాయతీ పరిధిలో ఉన్న సమస్యలు పరిష్కరించే విధంగా చూడాలన్నారు. సచివాలయం సిబ్బంది అందరూ సకాలంలో విధులకు హాజరై సేవలు అందుబాటులో ఉండాలని ఆమె అన్నారు. సమయపాలన పాటించాన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ సెక్రెటరీ, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

మాట్లాడుతున్న సర్పంచ్

విద్యా దీవెనను సద్వినియోగం చేసుకోండి

జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్

ప్రజాశక్తి -పాడేరు:విద్యార్థులు రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న విద్యా దీవెనను సద్వినియోగం చేసుకుని ఉన్నతంగా చదువుకోవాలని జిల్లా కలెక్టర్ సుమిత కుమార్ సూచించారు. బుధవారం రాష్ట్ర ముఖ్యమంత్రి తూర్పు గోదావరి జిల్లా కొవ్వూరు నుండి ప్రారంభించిన జగనన్న విద్యా దీవెన కార్యక్రమం ప్రత్యక్ష ప్రసారాన్ని కలెక్టర్ కార్యాలయపు సమావేశ మందిరం నుండి లబ్ధిదారులతో కలిసి వీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ. రాష్ట్ర ప్రభుత్వం ఎఎస్ఆర్ జిల్లాలో 13 వేల 558 మంది విద్యార్థినీ, విద్యార్థులకు రూ.7 కోట్ల 27 లక్షల 66 వేల 636లను విద్యార్థుల తల్లుల ఖాతాలకు జమ చేయడం జరిగిందన్నారు. ప్రభుత్వ ఆశయాల మేరకు ప్రతీ విద్యార్థి ఉన్నతంగా చదువు కోవాలని సూచించారు. గిరిజన సంక్షేమ శాఖ ద్వారా 11,612 మంది గిరిజన విద్యార్థులకు రూ. 5 కోట్ల 78 వేలు, సాంఘిక సంక్షేమ శాఖ ద్వారా 16 మంది ఎస్సీ విద్యార్థులకు 1 లక్ష 90వేలు, వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ద్వారా 1431 మంది బిసి విద్యార్థులకు రూ 1.కోటి 4 లక్షలు, 143 మంది ఇబిసిలకు 15 లక్షల 67 వేలు, 296 మంది కాపు విద్యార్థులకు రూ.21 లక్షల 77 వేలు, మైనారిటీ సంక్షేమ శాఖ ద్వారా 11 మంది క్రిష్టయన్ విద్యార్థులకు రూ.1 లక్ష 64 వేలు, 49 మంది ముస్లిం మైనారిటీల విద్యార్థులకు రూ.4 లక్షలు జమ చేయడం జరిగిందన్నారు.ఈ సమావేశంలో ట్రైకార్ చైర్మన్ శతక బుల్లిబాబు, గిరిజన సంక్షేమ శాఖ ఉప సంచాలకులు ఐ.కొండలరావు, ఎంపిపి సోనారి రత్నకుమారి, ట్రైకార్ డైరెక్టర్ సుమర్ల సరస్వతి, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

లబ్ధిదారులకు చెక్‌ను అందజేస్తున్న కలెక్టర్ సుమిత్‌కుమార్

బస్ కాంప్లెక్స్‌లో సదుపాయాలు కల్పించాలి

గిరిజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సురేంద్ర

పరిశీలిస్తున్న సురేంద్ర, బాలదేవ్

ప్రజాశక్తి- అరకులోయ:అరకులోయ ఆర్టీసీ కాంప్లెక్స్ లో కనీస సదుపాయాలు కల్పించాలని ఏపీ గిరిజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కిలో సురేంద్ర, జిల్లా ప్రధాన కార్యదర్శి పొద్దు బాల్ దేవ్ డిమాండ్ చేశారు. అరకులోయ అసెంబ్లీ, పార్లమెంట్ కేంద్రంలో ఉన్న ఏ.పీ ఎస్.ఆర్,టి.సి బస్ కాంప్లెక్స్‌లో కనీసం మంచినీటి, మరుగుదొడ్లలో రన్నింగ్ వాటర్ సదుపాయం లేక పోవడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వారు ఆవేదన వ్యక్తం చేశారు. బుధవారం ఆర్టిసి కాంప్లెక్స్‌లో వారు సందర్శించి పరిశీలించారు. మంచినీటి సదుపాయం లేకపోవడంతో వేసవిలో ప్రయాణికులు తీవ్రమైన ఇబ్బందులు పడుతున్నారన్నారు. మరుగుదొడ్లు అలంకార ప్రాయంగా ఉన్నాయని, ఎంపీ, ఎమ్మెల్యే నియోజకవర్గం కేంద్రంలోని ఆర్టిసి కాంప్లెక్స్ లో ఇటువంటి పరిస్థితి ఉండటం శోచనీయమన్నారు. ఈ ఆర్టీసీ బస్ కాంప్లెక్స్ వద్ద నుంచి ఎస్‌కోట, విశాఖ, పాడేరుకు రోజుకు 1500 మంది ప్రయాణికులు వెళ తుంటారన్నారు. ప్రముఖ పర్యాటక కేంద్రంగా పేరుగాంచిన అరకులలో ఇటువంటి పరిస్థితి ఉండటం ఆర్టీసీ అధికారుల నిర్లక్ష్యానికి అర్థం పడుతుందని వారు తెలిపారు. మరుగుదొడ్లలో రన్నింగ్ వాటర్ లేకపోతే ఫలితమేముందని వారు ప్రశ్నించారు. ప్రయాణికుల ఇబ్బందులను దష్టిలో పెట్టుకుని తక్షణమే బస్ కాంప్లెక్స్ లో తాగునీరు, మరుగుదొడ్లు వినియోగంలోకి తేవాలని డిమాండ్ చేశారు.కనీస సౌకర్యాలు కల్పించకుంటే ఆందోళన చేపడతామని వారు హెచ్చరించారు.

30న కౌన్సెలింగ్

ప్రజాశక్తి-పాడేరు టౌన్: గురుకులం విద్యా సంస్థలలో విధులు నిర్వహిస్తున్న బోధనేతర సిబ్బంది బదిలీలకు ఈనెల 25 సాయంత్రం 5 గంటల లోపు టిడబ్ల్యు డిడి కార్యాలయానికి దరఖాస్తు చేయాలని ఐటిడిఎ పిఒ వి.అభిషేక్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. విశాఖ, అనకాపల్లి, అల్లూరి జిల్లాల పరిధిలో విధులు నిర్వహిస్తూ ఏప్రిల్ 30 నాటికి రెండు సంవత్సరాలు సర్వీసు పూర్తి చేసుకున్న బోధనేతర సిబ్బంది బదిలీకి దరఖాస్తు చేసుకోవచ్చని సూచించారు. ఏప్రిల్ 30 నాటికి 5 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సిబ్బందికి తప్పని సరిగా బదిలీ చేయడం జరుగుతుందని పేర్కొన్నారు. ఈనెల 26న తాత్కాలిక మెరిట్ జాబితాను ప్రచురిస్తామని, 27న అభ్యంతరాలు స్వీకరిస్తారని, 29న తది జాబితా ప్రకటించడం జరుగుతుందన్నారు. ఈనెల 30న ఐటిడిఎ సమావేశ మందిరంలో బదిలీల కౌన్సిలింగ్ జరుగుతుందని పేర్కొన్నారు.

మన్యంలో గాలివాన బీభత్సం

విరిగిన భారీ వృక్షాలు

ప్రజాశక్తి -అనంతగిరి:మండలంలోని బుధవారం ఉరుములతో కూడిన గాలివాన బీభత్సం కారణంగా పలుచోట్ల భారీ వృక్షాలు విరిగిపడ్డాయి.కొండిభ పంచాయతీ పరిధి బోరిబోరి వలస గ్రామంలో భారీ మామ్మిడి చెట్టు ఇంటి సమీపంలో కూలి పోయింది. దీంతో, ఇళ్లల్లో ఉన్న ప్రజలు ఒక్కసారిగా ఉలిక్కిపడ్డారు. రోడ్డుకు అడ్డంగా చెట్టు విరిగి పడటంతో వాహనాల రాకపోకలకు అంతరయం ఏర్పడింది.

కూలిన ప్రహరీ గోడ

మండలంలో కురిసిన గాలివాన బీభత్సంతో లుంగపర్తి పంచాయతీ దిగువ పట్టి ఎంపీపీ పాఠశాల ప్రహరీ గోడ కుప్ప కూలింది. పనులలో నాణ్యత లేక పోవడంతోనే గోడ నిర్మాణం చేపట్టి రెండేళ్లయినా కాకుండానే వర్షానికి దెబ్బతిని కూలి పోవడంతో గ్రామ ప్రజలు మండిపడ్డారు. సెలవు దినాలు కావడంతో విద్యార్థులకు పెను ప్రమాదం తప్పింది.

జి.మాడుగుల: మండలంలో గెమ్మెలి పంచాయతీ ఊడపాలెంలో బుధవారం వీచిన భారీ ఈదురు గాలులకు భారీ వృక్షం నేల కూలింది. విద్యుత్ వైర్లు తెగిపడ్డాయి. విద్యుత్ శాఖాధికారులు స్పందించి సరఫరా నిలిపివేశారు. రహదారిపై వృక్షం పడడంతో ట్రాఫిక్ కు తీవ్ర అంతరాయం ఏర్పడింది.

అనంతగిరి, జి.మాడుగుల మండలాల్లో రోడ్డుకు అడ్డంగా కూలిన చెట్లు

క్వారీతో గిరిజనులకు తీవ్ర నష్టం

ప్రజాశక్తి-ముంచింగిపుట్టు:మండల పరిధిలోని మాకవరం గ్రామ సమీపంలో నల్లరాయి క్వారిని క్వారీని తక్షణమే మూసివేయాలని మండల వైస్ ఎంపీపీ పాటు భోయి1 సత్యనారాయణ డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా నిరసన చేపట్టిన అనంతరం ఆయన మాట్లాడుతూ, ఈ క్వారీ కారణంగా సమీపంలోని అరబీరు, కెందుపుట్టు గ్రామాల్లో వ్యవసాయ పంటలు పండటం లేదన్నారు. క్వారీ బ్లాస్టింగ్‌తో గృహాల గోడలు బీటలు బారుతున్నాయన్నారు. ఈ సమస్యలపై అనేకమార్లు మండల తహసిల్దార్ కు ఫిర్యాదు చేసినప్పటికీ ఆప లేదని అన్నారు. క్వారి తక్షణమే నిలి వేసి నష్టపోయిన రైతులకు 8 సంవత్సరాల పంట నష్టం, కుటుంబానికి రెండు లక్షల చొప్పున చెల్లించాలని డిమాండ్ చేశారు. 2014 సంవత్సరం నుండి 2023వ సంవత్సరం వరకు క్వారీ కార్మికులు నలుగురు మృతి చెందారని, ఈ కుటుంబ సభ్యులకు ఎక్స్‌గ్రేషియా 20 లక్షల చొప్పున ఇవ్వాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో పోరాటాలకు సిద్ధమవుతామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంఘం మండల అధ్యక్షుడు ఎం ఎం శ్రీను, సిపిఎం మండల నాయకులు నర్సింగ్ పడాల్, మాకవరం, అరబీరు, కెందుపుట్టు గ్రామ గిరిజనులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

నినాదాలు చేస్తున్న సిపిఎం నేతలు, గిరిజనులు

టిడిపిలో చేరిక

ప్రజాశక్తి-హుకుంపేట:మండలంలోనీ కొంతిలి గడికించుమండ, మేరకసింత పంచాయతీలకు చెందిన పలువురు టీడీపీ మండల అధ్యక్షుడు కొర్ర తులసీరావు ఆధ్వర్యంలో ఆ పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. వైసీపీ పాలన నచ్చక టిడిపిపై మక్కువ చూపించారని రాష్ట్ర ఎస్సీ , ఎస్టీ కమీషన్ మాజీ సభ్యులు సివేరిఅబ్రహం అన్నారు. మండలంలోని పంతులు పంచాయతీలో సమావేశానికి ముఖ్యఅతిథిగా పాల్గొన్న అబ్రహం టీడీపీ పార్టీ కండువాలు కప్పి పార్టీలోకి బుధవారం ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ తెలుగు యువత మండల అధ్యక్షుడు కామేశ్వరరావు, నేతలు స్వామి, ఈశ్వర్, త్రినాథ్, కామేశ్ పాల్గొన్నారు.

పారదర్శకంగా ఇంటర్వ్యూలు

ప్రజాశక్తి-పాడేరు టౌన్: పారదర్శకంగా అంగన్వాడీ సిబ్బంది ఇంటర్వ్యూలు పూర్తి చేసామని ఇన్చార్జి సబ్ కలెక్టర్, ఐటిడిఎ పిఒ వి.అభిషేక్ అన్నారు. బుధవారం స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయపు సమావేశ మందిరంలో అంగన్వాడీ సిబ్బంది పోస్టుల భర్తీకి ఇంటర్వ్యూలు నిర్వహించారు. అంగన్వాడీ వర్కర్ 1 పోస్టు, మినీ అంగన్వాడీ వర్కర్స్ 2, అంగన్వాడీ సహాయకులు 7 పోస్టులకు ఇంటర్వ్యూలు నిర్వహించామన్నారు. ఈ కార్యక్రమంలో ఐసిడిఎస్ పిడి సూర్యలక్ష్మి, పలువురు సిడిపిఒలు తదితరులు పాల్గొన్నారు.

అక్రమ అరెస్టులపై గిరిజనుల నిరసన

ప్రజాశక్తి-రాజవొమ్మంగి

తన మాజీ కారు డ్రైవర్, దళిత యువకుడైన సుబ్రహ్మణ్యంను హత్య చేసి డోర్ డెలివరీ చేసిన ఎమ్మెల్సీ అనంత ఉదయ భాస్కర్ (అనంతబాబు) షరతులతో కూడిన బెయిల్‌పై విడుదలై బుధవారం రంపచోడవరం రాక సందర్భంగా బహిరంగ సభ నిర్వహించిన నేపథ్యంలో గిరిజన నాయకులను పోలీసులు అక్రమంగా అరెస్టు చేయడంపై గిరిజనులు ఆగ్రహం వ్యక్తం చేశారు. అక్రమ అరెస్టులను ఖండిస్తూ గిరిజన సంఘం, సిపిఎం ఆధ్వర్యంలో మహిళలు, గిరిజనులు బుధవారం దుర్గానగరం, కేశవరం గ్రామాల్లో నిరసన కార్యక్రమాలు చేపట్టారు. ప్రభుత్వం, పోలీసులు, అధికారులకు వ్యతిరేకంగా పెద్ద పెట్టున నినాదాలు చేశారు. ప్రభుత్వ దిష్టిబొమ్మను దగ్ధం చేశారు. ఈ సందర్భంగా గిరిజన సంఘం మండల ఉపాధ్యక్షులు పాండవుల సత్యనారాయణ, సిపిఎం మండల కమిటీ సభ్యులు మేలిన రమేష్, పోలిశెట్టి చిన్నారావు మాట్లాడుతూ ఎమ్మెల్సీ అనంతబాబు బలనిరూపణకు బహిరంగ సభ ఏర్పాటు చేయడం విడ్డూరంగా ఉందన్నారు. దళిత యువకుడు హత్య కేసులో ఏ1 నిందితుడుగా ఉన్న అనంతబాబు బహిరంగ సభకు అధికారులు ఏ విధంగా అనుమతులిచ్చారని ప్రశ్నించారు. ప్రభుత్వం, అధికారుల చర్యలను ప్రజాస్వామ్యవాదులు, ఆదివాసీలు, ప్రజా సంఘాల నాయకులు ఖండించాలని విజ్ఞప్తి చేశారు. లేకుంటే ఆదివాసీల మనుగడ ప్రమాదంలో పడే అవకాశం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంఘం, సీపీఎం నాయకులు పొత్తూరు సత్యనారాయణ, ఎం సురేష్, మురళి, రాజుబాబు, ఎం.రాజేశ్వరి, సత్యవతి, నూకాలమ్మ తదితరులు పాల్గొన్నారు.

కేశవరం గ్రామంలో ప్రభుత్వ దిష్టిబొమ్మ దగ్ధం చేస్తున్న సిపిఎం నాయకులు, గిరిజనులు

ఆదివాసీ జెఎసి ఖండన

రంపచోడవరం : ఎమ్మెల్సీ అనంతబాబు బహిరంగ సభ నేపథ్యంలో గిరిజన నాయకులను అరెస్టు చేయడాన్ని ఆదివాసీ జెఎసి నాయకులు కంగల శ్రీనివాస్, సిఐటియు నాయకులు మట్ల వాణిశ్రీ, గిరిజన నాయకుడు తీగల శ్రీనివాస్ తీవ్రంగా ఖండించారు. దళిత యువకుడిని హత్య చేసిన హంతకుడి బహిరంగ సభకు అనుమతి ఇచ్చి ఏమి సందేశం ఇస్తున్నారని ప్రశ్నించారు. ఆదివాసీలు, దళితులపై దాడులకు పాల్పడి హత్యలు చేసే వారికి ఊరేగింపులు, సన్మానాలు చేయడం, వత్తాసు పలకడం ప్రమాదకరమని, దీని వల్ల గిరిజనులకు భవిష్యత్తులో తీవ్ర నష్టం వాటిల్లనుందని పేర్కొన్నారు. పోలీసులు అత్యుత్సాహంతో వైసీపీ కార్యకర్తలాగ గూండాలగా ప్రవర్తించి ఆదివాసీ జేఏసీ నాయకులను భయభ్రాంతులకు గురిచేశారని ఆరోపించారు.

హంతకుడి బహిరంగ సభ పేరుతో అక్రమ అరెస్టులు తగవు

సిపిఎం రంపచోడవరం జిల్లా కార్యదర్శి కిరణ్

ప్రజాశక్తి-రాజవొమ్మంగి

దళిత యువకుడు, తన మాజీ కారు డ్రైవర్ అయిన వీధి సుబ్రహ్మణ్యంను హత్య చేసి డోర్ డెలివరీ చేసిన కేసులో షరతులతో కూడిన బెయిల్‌పై విడుదలై రంపచోడవరం వచ్చిన సందర్భంగా బహిరంగ సభ ఏర్పాటు చేసిన నేపథ్యంలో మాజీ ఎమ్మెల్యేతో సహా సిపిఎం, గిరిజన సంఘం, ఆదివాసీ సంఘాల నాయకులను అరెస్టు చేయడం తగదని సిపిఎం ఎఎస్ఆర్ రంపచోడవరం జిల్లా కార్యదర్శి బొప్పెన కిరణ్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పోలీసుల చర్యలను ఆయన తీవ్రంగా ఖండించారు. వైసిపి నుండి సస్పెండ్ చేసిన హంతకుడు అనంతబాబు పార్టీ బహిరంగ సభ ఏవిధంగా నిర్వహిస్తారని ప్రశ్నించారు. హంతకుని బహిరంగ సభకు అధికారులు అనుమతులివ్వడాన్ని ఆయన తప్పుపట్టారు. పోలీసులు హంతకులకు కొమ్ముకాసి ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తున్నారని దుయ్యబట్టారు. బోయ వాల్మీకి, బెంతు ఒరియాలను ఎస్టీ జాబితాలో చేర్చడాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్న ఆదివాసీలను తప్పుదోవ పట్టించేందుకే అధికారులు, ప్రభుత్వం హంతకుడి చేత సభ నిర్వహించారని విమర్శించారు.

అనంతబాబుకు ఘన స్వాగతం

ప్రజాశక్తి- రంపచోడవరం

ఎమ్మెల్సీ అనంత ఉదయ్ భాస్కర్ (అనంతబాబు)కు వైసిపి నాయకులు, కార్యకర్తలు బుధవారం ఘన స్వాగతం పలికారు. తన కారు మాజీ డ్రైవర్, దళిత యువకుడు సుబ్రహ్మణ్యంను హత్య చేసి డోర్ డెలివరీ చేసిన కేసులో జైలులో ఉన్న ఆయన షరతుల కూడిన బెయిల్‌పై విడుదలై మొదటి సారిగా బుధవారం రంపచోడవరం ఇచ్చారు. ఎల్లవరం నుండి రంపచోడవరం వరకు ఎమ్మెల్సీ అనంత బాబు ర్యాలీగా రావడం జరిగింది. రంపచోడవరం అంబేద్కర్ సెంటర్ వద్ద వైసిపి కార్యకర్తలు అనంతబాబుకు భారీ పూలదండతో స్వాగతం పలికారు. అనంతరం దేవీపట్నం రోడ్డులో సబ్ కలెక్టర్ కార్యాలయం ఎదురుగా బహిరంగ సభ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఏడు మండలాలకు చెందిన వైసిపి శ్రేణులు పెద్ద సంఖ్యలో హాజరయ్యాయి. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే నాగులాపల్లి ధనలక్ష్మి, జాక్కంపూడి రాజు, వలపురు రాజా, నేను సైతం శివ ప్రసాద్, శారిమిల రాజా, 11 మండలాల పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

భారీ పూలమాలతో స్వాగతం పలుకుతున్న వైసిపి శ్రేణులు

పోలవరం నిర్వాసితుల హక్కుల కోసం జూన్ 20 నుంచి మహా పాదయాత్ర

సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు సీతారాం, వెంకటేశ్వర్లు

మాట్లాడుతున్న సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు మంతెన సీతారాం

ప్రజాశక్తి-కూనవరం

పోలవరం ప్రాజెక్టు నిర్వసితుల హక్కుల సాధనకై జూన్ 20న మహా పాదయాత్ర ప్రారంభిస్తున్నట్లు సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు మంతెన సీతారాం, వి.వెంకటేశ్వర్లు తెలిపారు. ఈ పాదయాత్ర ఎటపాక నుండి విజయవాడ వరకు కొనసాగుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమం నిర్వహణపై బుధవారం కూనవరం ఉన్నత పాఠశాలలో వర్క్‌షాప్ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పోలవరం ప్రాజెక్ట్ వల్ల సర్వం కోల్పోయి గోదావరి వరదల వల్ల భారీ నష్టాన్ని చవిచూస్తున్న నిర్వసితులకు శాశ్వతంగా పరిస్కారం చూపాలని డిమాండ్ చేశారు. గతేడాది జులైలో వచ్చిన వరదలకు ఈ ప్రాంత ప్రజలు అనేక ఇబ్బందులకు గురయ్యారని ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ముంపు గురైన 6 మండలాల ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్నాయని విమర్శించారు. ముంపునకు గురవుతున్న 222 పంచాయితీ, 373 గ్రామాలు, లక్షా ఆరు వందల కుటుంబాలు వరదలకు సంపూర్ణంగా నీటమునుగుతున్నాయని తెలిపారు. ఈ కుటుంబాలకు పునరావాసం, ప్యాకేజీ కేంద్ర ప్రభుత్వం బాధ్యత కాగా, మోడీ ప్రభుత్వం దానిని ఇవ్వనని చెప్పడం దారుణమన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కాంటూరు లెక్కలు చెబుతూ ప్రజలను మోసం చేస్తున్నాయని, ముంపునకు గురైన ప్రతి నిర్వసితుడికి న్యాయం జరిగేలా చూడాలని డిమాండ్ చేశారు.

సిపిఎం ఎఎస్ఆర్ రంపచోడవరం జిల్లా కార్యదర్శి బొప్పెన కిరణ్ మాట్లాడుతూ వరదలకు రాక ముందే నిత్యావసరాల సరుకులను ముంపు లేని గ్రామాల్లో నిల్వ చేయాలన్నారు. బోయ, వాల్మీకి, బెంతు ఒరియాలను ఎస్టీ జాబితాలో చేర్చి గిరిజనులకు ఈ ప్రభుత్వాలు అన్యాయం చేస్తున్నాయని తెలిపారు. సిపిఎం ఏలూరు జిల్లా కార్యదర్శి రవి మాట్లాడుతూ పోలవరం నిర్వసితులకు 41 కాంటూరు లెక్కలతో సంబంధం లేకుండా ప్యాకేజీ, పునరావాసం ఇచ్చి ప్రతి నిర్వసితుడికి న్యాయం జరిగేలా చూడాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం కూనవరం, విఆర్.పురం, చింతూరు, ఎటపాక, వేలూరుపాడు, కుకునూరు మండలాల కార్యదర్శులు పాయం సీతారామయ్య, సోయం చినబాబు, సీసం సురేష్, ఐ.వెంకటేశ్వర్లు, ధర్ముల రమేష్, ఎర్రంశెట్టి నాగేంద్రబాబు, జిల్లా నాయకులు మేకల నాగేశ్వరరావు, పల్లపు వెంకట్, పూనెం సత్యనారాయణ, ఎర్రంశెట్టి శ్రీనివాసరావు, విఆర్ ఎంపీపీ కారం లక్ష్మి, కూనవరం వైస్ ఎంపీపీ కొమరం పెంటయ్య, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

విహార యాత్రలో విషాదం

చెట్టు కొమ్మ విరిగిపడి మహిళ మృతి

ప్రజాశక్తి-మరేడుమిల్లి

ప్రకృతి ఒడిలో సరదగా సేదతీరుదామని వచ్చిన ఓ పర్యాటకురాలు చెట్టు కొమ్మ విరిగిపడి మృత్యువాత పడిన సంఘటన బుధవారం స్థానిక అమృతదార జలపాతం వద్ద చోటు చేసుకుంది. మృతురాలి బంధువులు, పోలీసుల కథనం ప్రకారం... ఉమ్మడి పచ్చిమ గోదావరి జిల్లా ఆకివీడుకు చెందిన ఏడుగురు కుటుంబ సభ్యులు, రాజమహేంద్రవరానికి మరో మహిళ మొత్తం ఎనిమిది మంది విహార యాత్ర కోసం మారేడుమిల్లి వచ్చారు. ఇక్కడ నుంచి జలతరంగిణి జలపాతం సందర్శించి అక్కడ నుంచి అమృతధార జలపాతానికి వెళ్లారు. వీరిలో రాజమహేంద్రవరానికి చెందిన ఎ.సంధ్య (38) జలపాతం పైభాగంలో బండరాలపై కుర్చోని ఉండగా ఒక్కసారిగా అక్కడ ఉన్న భారీ చెట్టు కొమ్మ విరిగి ఆమెపై పడింది. దీంతో ఆమె పైనుంచి కిందకు జారి బండరాళ్లపై పడిపోయింది. ఈ ప్రమాదంలో ఆమె తలకు, కాళ్లకు తీవ్ర గాయాలయ్యాయి. బంధువులు స్థానిక పిహెచ్‌సికి తరలించగా ప్రాథమిక చికిత్స అనంతరం పరిస్థితి విషమంగా ఉండటంతో రంపచోడవరం ఏరియా అనుపత్రికి తరలిస్తుందగా మార్గమధ్యలో మృతి చెందారు. దీనిపై మారేడుమిల్లి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అంబులెన్స్‌లో సంధ్య మృతదేహం

ఫిర్యాదు చేస్తున్న నాయకులు

బియ్యం పంపిణీ చేయకపోవడంపై గిరిజన సంఘం ఫిర్యాదు

ప్రజాశక్తి-పాడేరు: చింతపల్లి మండలం కుడుముసారి, తురుబొంగుల గ్రామాల్లో ఉచిత బియ్యం సరఫరాలో అక్రమాలు చోటు చేసుకున్నాయని ఏపీ గిరిజన సంఘం జిల్లా నాయకుడు పాంగి ధనుంజయ్ ఈ గ్రామస్తులతో కలిసి బుధవారం మండల తహసీల్దారుకు ఫిర్యాదు చేశారు. ఈ గ్రామాలకు చెందిన 120 మంది ఉచిత బియ్యం లబ్ధిదారులకు రెండు నెలలుగా బియ్యం సరఫరా జరగ లేదని తహసీల్దార్ కు వివరించారు. గిరిజన లబ్ధిదారులకు పంపిణీ చేయవలసిన సుమారు రెండు వందల కిలోల బియ్యం పక్కదారి పట్టాయని ఫిర్యాదు చేశారు. ఈ రెండు గ్రామాల లబ్ధిదారులు కుడుముసారిలోని రేషన్ డిపో వద్దకు వెళ్లి బియ్యం కోసం వాకబు చేయగా సంచార సరఫరా విభాగం వారికి డిపో నుంచి బియ్యం సరఫరా చేసినట్టు తెలియజేశారని తహసీల్దార్ కు వివరించారు. మారు మూల ప్రాంతమైన ఈ గ్రామాల్లో లబ్ధిదారులకు బియ్యం సరఫరాలో అన్యాయం జరుగుతోందని, దీనిపై దర్యాప్తు చేయించి బియ్యం సక్రమంగా సరఫరా జరిపేందుకు చర్యలు తీసుకోవాలని తహసీల్దారును కోరారు. లబ్ధిదారులకు బియ్యం సరఫరా చేయకుండా పక్క దారి పట్టించిన వారిని గుర్తించి కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. ఈ ప్రాంతంలో ఉచిత బియ్యం సరఫరా విషయంలో గతంలో కూడా మొబైల్ డిస్పెన్సింగ్ యూనిట్ వారిపై బియ్యం సక్రమంగా సరఫరా చేయడం లేదని పలు ఆరోపణలు ఉన్నాయని జిల్లా పౌర సరఫరా అధికారులు నిఘా వేసి అక్రమాలను గుర్తించి వెంటనే తగిన చర్యలు తీసుకోవాలని ధనుంజయ డిమాండ్ చేశారు.

బహుమతులతో చిన్నారులు

చిన్నారులకు బహుమతుల ప్రదానం

ప్రజాశక్తి -ముంచింగిపుట్టు: మండలకేంద్రంలో గిరి బాల నేస్తం సమ్మర్ క్యాంపును గిరిజన మహిళా సంఘం (ఐద్వా) సభ్యురాలు ఎస్.ఈశ్వరి ఆధ్వర్యంలో విజయవంతంగా నిర్వహించారు. పిల్లలు ఉత్సాహంగా పాల్గొన్నారు. మండలం వైస్ ఎంపీపీ1 పాటు భోయి సత్యనారాయణ పిల్లలకు బహుమతులు స్పాన్సర్ చేశారు. గిరిజన సంఘం నాయకుడు ఎంఎం శ్రీను, పాటుబోయి సత్యనారాయణ చేతుల మీదుగా పిల్లలకు బహుమతులు అందజేశారు.

విశాఖపట్నం - అరకు సెక్షన్‌ను డిఆర్‌ఎం తనిఖీ

ప్రజాశక్తి -ఎంవిపి కాలనీ : విశాఖపట్నం-అరకు సెక్షన్ ను డివిజనల్ రైల్వే మేనేజర్ అనూప్ సత్పతి బుధవారం తనిఖీ చేశారు. సెక్షన్‌లో జరుగుతున్న వివిధ అభివృద్ధి కార్యక్రమాల పురోగతిని, స్టేషన్లలో సౌకర్యాలను పరిశీలించారు. అనంతరం అరకు స్టేషన్‌లోని విశ్రాంతి భవనం, వెయిటింగ్ హాళ్లు, వసతి గృహాలు, ఇతర రైల్వే కార్యాలయాలను పరిశీలించారు. బొడ్డవర రైల్వే స్టేషన్‌లో డబ్లింగ్ పనులు, స్టేషన్‌లో భద్రతకు సంబంధించిన ఆధునికరణ పనులను పరిశీలించారు. ఈ తనిఖీల్లో చీఫ్ ఇంజనీర్, కెడి రావు, ఎడిఆర్ఎం సుధీర్ కుమార్ గుప్తా, ఎకె మోహారానా, జి. సునీల్ కుమార్, ఎకె.త్రిపాఠి, దీప్తాన్షు శర్మ, ప్రభాత్ సింగ్ తదితరులున్నారు.

కొనసాగిన హమాలీల సమ్మె

నిరసనలు చేస్తున్న హమాలీలు

ప్రజాశక్తి-పాడేరు: పెరిగిన కూలి రేట్లుకు సంబంధించి బకాయి (ఏరియర్స్) చెల్లించాలని గిరిజన సహకార సంస్థలో పని చేస్తున్న హమాలీలు చేపట్టిన సమ్మె రెండవ రోజు బుధవారం కొనసాగింది. 13 నెలల నుంచి ఏరియర్స్ బకాయిలు చెల్లించని పరిస్థితుల్లో జీసీసీ హమాలీలు తమ విధులను బహిష్కరించి సమ్మెకు ఉపక్రమించారు. పాడేరులో జీసీసీ కార్యాలయం ఎదుట సమ్మెలో భాగంగా భైఠాయించిన జీసీసీ హమాలీల దీక్ష శిబిరాన్ని సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యులు ఎల్.సుందరరావు బుధవారం సందర్శించి హమాలీల సమ్మెకు మద్దతు తెలిపారు. అనంతరం మాట్లాడుతూ, 2022 జనవరిలో పెరిగిన ఎగుమతి, దిగుమతి కూలి క్వింటకు రూ:3 పెంచినప్పటి నుండి నేటి వరకు బకాయి చెల్లించాలని పలుమార్లు అధికారులకు విన్నవించినా పట్టించుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. మూడు జతల బట్టలు పంపిణీ చేయాల్సి ఉన్నా అందించలేదన్నారు. హమాలీలకు ఈఎస్ఐ, ఇన్సూరెన్స్ సదుపాయం కల్పించాలని డిమాండ్ చేశారు. సమస్యల పరిష్కారం అయ్యేంత వరకు సమ్మె కొనసాగుతుందని స్పష్టం చేశారు ఇప్పటికైనా సంబదిత అధికారులు స్పందించి బకాయి వేతనాలు చెల్లించాలని, కనీస వేతనం 26 వేల రూపాయలు ఇవ్వాలని, యూనిఫామ్ అలవెన్స్ ఇవ్వాలన్నారు. సమస్యల పరిష్కారం చేయకపోతే ఆందోళన ఉధృతం చేస్తామని ఈ సందర్భంగా హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జిసిసి హమాలీల నాయకులు కుమార్, దేవుడు, గౌరి నాయుడు, భాస్కర్ రావు, బుజ్జి కార్మికులు పాల్గొన్నారు.

జి.మాడుగుల: స్థానిక జిసిసి గొడౌన్ వద్ద నిర్వహించిన జిసిసి హమాలీల సమ్మె రెండో రోజు విజయవంతంగా కొనసాగింది. ఈ సందర్భంగా బుధవారం ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి వి.పండుబాబు స్థానిక విలేకరులతో మాట్లాడుతూ, 13 నెలల ఏరియర్స్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. సమస్యలు పరిష్కరించే వరకు సమ్మె కొనసాగిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో హమాలీలు పాల్గొన్నారు

ఉపాధి పని ప్రదేశాల్లో సౌకర్యాలు కల్పించాలి

ప్రజాశక్తి-అరకులోయరూరల్: మండలంలోని బస్కి, మాడగడ పంచాయితీ పరిధిలో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో పని చేస్తున్న కూలీలకు 200రోజులు పని దినాలు కల్పించి రోజు కూలీ రూ.600 ఇవ్వాలని సిపిఎం మండల కార్యదర్శి కె రామారావు డిమాండ్ చేశారు. బుధవారం మండలంలోని బస్కి, మాడగడ పంచాయితీ పరిధిలో గ్రామాల్లో సిపిఎం మండల కార్యదర్శి కె.రామారావు పర్యటించి ఉపాధి కూలీల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, గిరిజన ప్రాంతంలో ఉపాధి దొరకక గిరిజనులు తీవ్ర ఇబ్బందులకు గురి అవుతున్నారని, ఉపాధి హామీ పథకం తప్ప మరొకటి లేదన్నారు. ఉపాధి హామీ పథకంలో పని చేస్తున్న కూలీలకు 200 రోజులు పని దినాలు కల్పించి రోజు 600 రూపాయలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. వేసవి కాలంలో అలవెన్స్ రూపంలో కూలీలకు అదనంగా బిల్లులు చెల్లించాలని చెప్పారు. గుణపాలు, పారలు, తట్టలు, టెంటు, ప్రథమ చికిత్స కిట్స్ పంపిణి చేయాలని డిమాండ్ చేశారు. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా కూలి రేట్లు పెంచాలని డిమాండ్ చేశారు.జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని కేంద్ర ప్రభుత్వం నిర్వీర్యం చేయడానికి కుట్ర పన్నుతుందని విమర్శించారు.వేసవి కాలంలో మజ్జిగ సరపరా చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో కూలీలు భగవాన్, కిండంగి హరి, మాణిక్యం, బొంజు, లైకోన్, స్వామి, ధన, సుబ్బమ్మ, రాధిక, కిల్లో. హరి తదితరులు పాల్గొన్నారు.

28న ఘంటసాల జీవిత చరిత్ర నాటకం

ప్రజాశక్తి-కలెక్టరేట్, విశాఖ : భారతదేశ నాటక రంగ చరిత్రలో మొట్టమొదటి నాటక గ్రంథాలయానికి శాశ్వత నిధుల కోసం రంగసాయి నాటక సంఘం ఆధ్వర్యాన ఈ నెల 28వ తేదీన ఘంటసాల జీవిత చరిత్ర నాటకాన్ని ప్రదర్శిస్తున్నట్లు రంగసాయి నాటక సంఘం వ్యవస్థాపక అధ్యక్షులు బాదంగీర్ సాయి తెలిపారు. విజెఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో బుధవారం ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, భాస్కరుని సత్యజగదీష్ దర్శకత్వంలో కళాభారతి ఆడిటోరియంలో ప్రదర్శిస్తున్నట్లు చెప్పారు. సాయంత్రం 5 గంటలకు ఒక ప్రదర్శన, రాత్రి 7:30 గంటలకు మరొక ప్రదర్శన ఉంటాయన్నారు. శ్రీసాయి సంతోషి నాట్య మండలి సురభి కళాకారులు 138 సంవత్సరాల చరిత్రలో తొలిసారి ఘంటసాల జీవిత చరిత్ర సాంఘిక నాటకాన్ని ప్రదర్శిస్తున్నారని తెలిపారు. రూ.300, రూ.200, రూ.100 డోనర్ పాసులు రంగ సాయి నాటక గ్రంథాలయంలోనూ, కళాభారతిలోనూ లభిస్తాయన్నారు. విశాఖ ప్రజలు ఈ నాటకాన్ని వీక్షించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీనియర్ జర్నలిస్ట్ ఎన్.నాగేశ్వరరావు, బిఎస్.చంద్రశేఖర్, సినీ నటులు కుమార్‌రాజా, కో-ఆర్డినేటర్ చినబాబు పాల్గొన్నారు.

విత్తనాలు పంపిణీ

ప్రజాశక్తి -పెదబయలు : అడుగులపుట్టు సచివాలయం రైతు భరోసా కార్యాలయంలో బుధవారం వ్యవసాయ శాఖధికారి శ్రీనివాసరావు, ప్రజాప్రతినిధుల ఆధ్వర్యంలో పచ్చి రొట్ట, వరి విత్తనాలు 90 శాతం రాయితీపై పంపిణి చేశారు. ఆర్‌జిఎల్ - 537 రకం రూ.1150 కాగా రాయితీపై రూ150కు, జనుము పది కిలోలు పూర్తి ధర 840 రూపాయల కాగా 100లకు రైతులకు అందజేశారు.

విత్తనాలు పంపిణీ చేస్తున్న చేస్తున్న ఎఒ

సకాలంలో విద్యా కానుక కిట్లు పంపిణీ

గిరిజన సంక్షేమ శాఖ ఉప సంచాలకులు కొండలరావు

ప్రజాశక్తి-పాడేరు: జగనన్న విద్యా కానుక కిట్లు సకాలంలో విద్యార్థులకు పంపిణీ చేయాలని గిరిజన సంక్షేమ శాఖ ఉప సంచాలకులు ఐ.కొండలరావు సూచించారు. బుధవారం కలెక్టర్ కార్యాలయం సమావేశ మందిరంలో సబ్ క్యాలయం వెల్ఫేర్ అసిస్టెంట్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, స్టాక్ పాయింట్లలో ఉన్న విద్యా కానుక కిట్లను ప్రతీ విద్యార్థికి పంపిణీ చేయడానికి వెల్ఫేర్ అసిస్టెంట్లు బాధ్యతలు తీసుకోవాలన్నారు. ప్రభుత్వం తల్లుల ఖాతాలకు జమ చేసిన జగనన్న విద్యాదీవెన నగదును కళాశాలలకు చెల్లించాలని అన్నారు. విద్యార్థుల బయోమెట్రిక్ అథెంటికేషన్ వేగంగా పూర్తి చేయాలని చెప్పారు. ఎన్రోలింగ్ పోర్టల్లో విద్యార్థి తల్లి ఆధార్ నంబర్లతో అనుసంధానం చేయాలని సూచించారు. డ్రాపౌట్ లేకుండా విద్యార్థులందరూ పాఠశాలలకు వచ్చే విధంగా తల్లిదండ్రులను చైతన్యవంతం చేయాలన్నారు. ప్రభుత్వం అందిస్తున్న విద్యా సదుపాయాలు, విద్య ఆవశ్యకతపై అవగాహన కల్పించాలని చెప్పారు. పాఠశాలలు తెరిచే నాటికి విద్యార్థులందరూ పాఠశాలలో ఉండే విధంగా కృషి చేయాలన్నారు. ఈ సమావేశంలో సూపరింటెండెంట్ శ్రీనివాస రెడ్డి, ఎటిడబ్ల్యూలు ఎల్.రజని, క్రాంతి కుమార్, వెంకటరమణ, మల్లికార్జున పాల్గొన్నారు.

యోగా చేస్తున్న విద్యార్థులు

యోగా పోటీలు

ప్రజాశక్తి-డుంబ్రిగూడ: స్థానిక శాఖ గ్రంథాలయంలో నిర్వహిస్తున్న సమ్మర్ క్యాంప్‌లో భాగంగా బుధవారం చిన్నారులకు యోగా పోటీలను నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రంథాలయాధికారిని సునీత మాట్లాడుతూ, వ్యాయామాలతో పాటు యోగాసనాలు ప్రతిరోజు చేయడంతో ఆరోగ్యంగా ఉండవచ్చు అన్నారు. చిన్నారులు చదువుతో పాటు యోగాసనాలు కూడా నేర్చుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది కే.సుబ్బారావు పాల్గొన్నారు.

'సంసద్ ఆదర్స్' ద్వారా అభివృద్ధి పనులు

ప్రజాశక్తి-కలెక్టరేట్, విశాఖ : సంసద్ ఆదర్స్ గ్రామ యోజన (ఎస్ఎజివై) ద్వారా గ్రామాల్లో పురోగతిలో ఉన్న పనులను త్వరితగతిన పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో బుధవారం పార్లమెంట్ సభ్యులు ఎంవివి.సత్యనారాయణ అధ్యక్షతన సంసద్ ఆదర్స్ గ్రామ యోజన పర్యవేక్షణ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, గ్రామ సర్పంచులు స్థానిక ఎంపిటిసి, ఎంపిపి సహకారంతో సంసద్ ఆదర్స్ గ్రామ యోజనలో చేయాల్సిన పనులు గుర్తించి సంబంధిత ప్రతిపాదనలను ఎండిఓలకు అందజేయాలన్నారు. ఎండిఓలు పార్లమెంట్ సభ్యులకు అందజేస్తే ఎంపీ నిధుల ద్వారా పనులు మంజూరవుతాయని చెప్పారు.

ఎంపీ ఎంవివి.సత్యనారాయణ మాట్లాడుతూ, గ్రామాలలో ఎండిఒ సర్వేచేసి అవసరమైన పనులు గుర్తించాలన్నారు. స్థానికంగా ఉన్న నిధుల లభ్యతను బట్టి కేటాయింపు చేసి మిగిలిన పనులకు తగు ప్రతిపాదనలు పంపాలని కోరారు.

నేడు వాహనాల వేలం

ప్రజాశక్తి -ఎంవిపి కాలనీ : గతంలో వివిధ కేసులలో పట్టుబడిన ఐదు ద్విచక్ర వాహనాలను మహారాణిపేట స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో డిప్యూటీ కమిషనర్ ఆధ్వర్యాన గురువారం ఉదయం 11 గంటలకు వేలంపాట నిర్వహించనున్నట్లు స్టేషన్ హౌస్ ఆఫీసర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి కలవారు ఎంవిపి సెక్టార్- 1లోని స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో కార్యాలయంలో జరిగే వేలంపాటలో పాల్గొనాలని సూచించారు.

అగ్ని ప్రమాద బాధితులకు సాయం

అగ్ని ప్రమాద బాధితులకు సహాయం అందిస్తున్న డాక్టర్ జమాల్‌ఖాన్

ప్రజాశక్తి- చింతూరు : మండలంలోని పెదశీతనపల్లి పంచాయతీ బొడ్రాయిగూడెం గ్రామంలో ఆదివారం జరిగిన అగ్నిప్రమాదంలో ఇళ్లు కాలిపోయి సర్వం కోల్పోయిన మిడియం భద్రమ్మ, పులి కన్నయ్య, పులి బ్రహ్మయ్య కుటుంబాలను ఆయుర్వేద వైద్యులు డాక్టర్ జమాల్ ఖాన్ జెకె ట్రస్ట్ వ్యవస్థాపకులు ఇమ్రాన్ ఖాన్ బుధవారం పరామర్శించారు. తమ వంతు సాయంగా ట్రస్ట్ తరపున ఒక్కో కుటుంబానికి 25 కేజీల బియ్యం, వంట పాత్రలు, బకెట్లు, గ్లాసులు గరిటలు, జగ్గులు, నిత్యవసర వస్తువులను అందజేశారు. ఇంకా సహాయం అందిస్తామని, అధైర్య పడవద్దని చెప్పారు. పులి శాంత కుట్టు మిషన్ అగ్ని ప్రమాదంలో కాలిపోవడంతో కుటుంబ పోషణ నిమిత్తం ఆశా సంస్థ ప్రతినిధి ఎస్‌డి సుభాని కుట్టుమిషన్ అందజేశారు. ఈ కార్యక్రమంలో జేకేటీఆర్ ట్రస్ట్ సభ్యులు పాల్గొన్నారు.

నిత్యావసరాల పంపిణీ

అగ్ని ప్రమాద బాధిత కుటుంబాలకు బిజెపి నాయకులు బుధవారం నిత్యావసర సరుకులు, వంట సామగ్రి అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ నాయకులు డివిఎస్.రమణరెడ్డి, సవలం ముత్తయ్య, సవలం వీర్రాజు, సోడి వెంకటరామయ్య, పాయం లక్ష్మణ్ రావు, పాయం భద్రయ్య, మిడియం జోగయ్య, వెట్టి రవి, సవలం రాజారావు తదితరులు పాల్గొన్నారు.

మావోయిస్టులు అమర్చిన బాంబు నిర్వీర్యం

ప్రజాశక్తి-చింతూరు: ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం బీజాపూర్ జిల్లాలో మావోయిస్టులు అమర్చిన బాంబును పోలీసులు బుధవారం నిర్వీర్యం చేశారు. ఆవపల్లి-బాసగూడ రహదారిలో రోడ్డు మధ్యలో 8X8 అడుగుల వెడల్పు, 5 అడుగుల లోతుతో నక్కల రంధ్రం అమర్చిన 25 కిలోల బాంబును పెట్టారు. దీనిని బీజాపూర్ బిడిఎస్ బృందం అక్కడికక్కడే నిర్వీర్యం చేయడంతో పెను ప్రమాదం తప్పింది.

పోలీసులు నిర్వీర్యంచేసిన మందుపాతర

నూతన చెరువు నిర్మాణ పనుల ప్రారంభం

చెరువు నిర్మాణ పనులను ప్రారంభిస్తున్న ఎంపిపి, సర్పంచ్

ప్రజాశక్తి-కొయ్యూరు : మండలంలోని మంప గ్రామ సమీపంలో ఉపాధి హామీ పథకం ద్వారా మంజూరైన నూతన చెరువు నిర్మాణ పనులను కొయ్యూరు ఎంపీపీ బడుగు రమేష్, సర్పంచి మాకాడ బాలరాజు బుధవారం ప్రారంభించారు. నీటి సంరక్షణ కోసం, భూగర్భ జలాలను పెంపొందించేందుకు, గిరిజన రైతులకు ఉపయోగపడే విధంగా పాడేరు ఐటీడీఏ ఆధ్వర్యంలో, వాటర్ షెడ్ పథకంలో భాగంగా ఈ చెరువు నిర్మాణం చేస్తున్నట్లు ఎంపిపి తెలిపారు.

మధ్యాహ్నం వేళల్లోనూ ఓపి సేవలు

ప్రభుత్వ ప్రాంతీయ నేత్ర వైద్యశాలలో అవుట్ పేషెంట్ సేవలు పొడిగింపు

ప్రజాశక్తి- సీతమ్మధార : విశాఖపట్నంలోని ప్రభుత్వ ప్రాంతీయ నేత్ర వైద్యశాలలో ప్రభుత్వ ఆదేశాల మేరకు అవుట్ పేషెంట్ సేవలను మరింత విస్తృతం చేస్తున్నట్లు ఆసుపత్రి సూపరింటెంటెండ్ డాక్టర్ పి.విశ్వామిత్ర వెల్లడించారు. ఇక నుంచి మధ్యాహ్నం 3 గంటల నుండి 4 గంటల వరకు ఒక గంటపాటు అదనంగా అవుట్ పేషెంట్ సేవలు అందుబాటులో ఉంటాయని, వాటిని రోగులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఉత్తరాంధ్రలో కంటిరోగులకు విశేషసేవలు అందిస్తున్న ప్రాంతీయ నేత్ర వైద్యశాలలో, ఒడిశాతోపాటు ఉమ్మడి ఉభయగోదావరి జిల్లాల నుంచి అధికసంఖ్యలో రోగులు వస్తుంటారు. ఈనేపథ్యంలో సుదూర ప్రాంతాల నుంచి వచ్చే రోగులకు ఇబ్బందులు లేకుండా, ఏరోజు వచ్చిన వారికి ఆ రోజే అవసరమైన అవుట్‌పేషెంట్ సేవలు అందించే విధంగా ఏర్పాట్లు చేస్తున్నట్లు వెల్లడించారు. వైద్యానికి వచ్చే కంటిరోగులు సేవలు పొందకుండా తిరిగి వెళ్లడం, మళ్లీ వచ్చే పరిస్థితులకు అస్కారం లేకుండా అవసరమైన సిబ్బందిని కూడా ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. మధ్యాహ్న వేళల్లో అవుట్‌పేషెంట్ సేవలను కూడా ఆయా రోజుల్లో ఉదయం అందుబాటులో ఉండే యూనిట్లు వైద్యులే అందిస్తారని, రోగులు గమనించి సేవలను వినియోగించుకోవాలని కోరారు.

సూపరెంటిండెట్ డాక్టర్ విశ్వామిత్ర

అక్రమ కేసులపై ఆటో కార్మికుల నిరసన

ప్రజాశక్తి- సీతమ్మధార : విశాఖనగరంలో ఆటో కార్మికులపై రవాణాశాఖ అధికారులు దాడులు నిర్వహించి, అక్రమ కేసులు బనాయించడాన్ని తక్షణమే ఆపాలని విశాఖ ఆటోరిక్షా కార్మిక సంఘం (సిఐటియు) జిల్లా ప్రధాన కార్యదర్శి కె.సత్యన్నారాయణ డిమాండ్ చేసారు. బుధవారం సిఐటియు ఆధ్వర్యంలో సీతమ్మధార అల్లూరి విగ్రహం వద్ద ఆటో కార్మికులతో నిరసన చేపట్టారు.

ఈ సందర్భంగా సత్యన్నారాయణ మాట్లాడుతూ ఆటో కార్మికులకు వాహనమిత్ర సాయమంటూ రూ.పది వేలు ఇచ్చిన ప్రభుత్వం ఆర్‌టిఒ అధికారులతో దాడులు చేయించి, అక్రమ కేసులను బనాయించడం ద్వారా అంతకు అనేకరెట్లు మొత్తాన్ని జరిమానా రూపంలో పిండేయడం దుర్మార్గమన్నారు. కార్మికుల సంక్షేమమంటూనే వారిని కుదేలు పరిచే చర్యలను తీవ్రంగా ఖండిస్తున్నట్లు వెల్లడించారు. కోవిడ్ విజృంభణ తర్వాత ప్రతి ఇంటిలోనూ సొంత వాహనం సమకూరడం, మరోవైపు డీజిల్, పెట్రోల్ ధరలు ఇబ్బడిముబ్బడిగా పెంచడంతో ఆటోకార్మికుల ఆదాయం పూర్తిగా పడిపోయిందని, రోజుకు రూ.300 ఆదాయం కూడా మిగలని పరిస్థితి ఉందన్నారు. ఇటువంటి పరిస్థితుల్లో ఆర్‌టిఒ, పోలీసుల దాడులు, కేసులు, జరిమానాలతో ఆటోకార్మికులను మానసిక వేదనకు గురిచేస్తూ, వారిని ఆత్మహత్యలకు పురిగొలిపే పరిస్థితులు కల్పించడం దారుణమన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి, ఆటోకార్మికులపై రవాణాశాఖ, పోలీసుల దాడులు, ఇతర వేధింపులకు చెక్ పెట్టాలని కోరారు. కార్యక్రమంలో సిఐటియు నగర కార్యదర్శి జి.అప్పలరాజు, ఆటో యూనియన్ గౌరవాధ్యక్షులు వి.కృష్ణారావు, నాయకులు కాటరాజు, నాయుడు, శ్రీను, సురేష్, గురునాధరెడ్డి పాల్గొన్నారు.

సిఐటియు ఆధ్వర్యాన ఆందోళన చేస్తున్న ఆటో కార్మికులు

నిరుపేదలకు సోలార్ విద్యుత్ సౌకర్యం

సోలార్ విద్యుత్ కనెక్షను అమర్చుతున్న సంస్థ సభ్యులు

ప్రజాశక్తి -భీమునిపట్నం : ఇప్పటికీ విద్యుత్ సదుపాయానికి నోచుకోని భీమిలి అర్బన్, ఆనందపురం మండల పరిధిలోని పలు గ్రామాలు, ప్రాంతాల్లో ఉన్న 29 కుటుంబాలకు ఆప్టిమస్ పరిశ్రమ సిఎస్ఆర్ నిధులతో హ్యాబిటెట్ ఫర్ హ్యుమనిటీ ఇండియా, ఎస్‌విడిఎస్, అసోసియేషన్ ఆఫ్ పీపుల్ పవర్ సంస్థలు కొనుగోలు చేసిన సోలార్ పవర్ ప్యానెల్, బ్యాటరీ, బల్బు, ఫ్యాన్, కన్వర్టర్, స్టాండ్ ఇతర సామగ్రిని బుధవారం ఉచితంగా అందజేశారు. భీమిలి, ఎగువ పేట, కృష్ణా కాలనీ, మామిడిపాలెం, ఆనందపురం మండలం లొడగలవానిపాలెం తది తర గ్రామాల్లో విద్యుత్ సదుపాయానికి నోచుకోని కుటుంబాలకు ఈ సోలార్ ప్యానెల్, ఇతర సామగ్రి అమర్చి విద్యుత్ సదుపాయం కల్పించారు. కార్యక్రమంలో ఎస్‌విడిఎస్ సంస్థ ప్రతినిధి చైతన్య, పీపుల్ పవర్ సంస్థ సభ్యులు నిమ్మకాయల భాస్కర్, జీవన్ కార్తీక్, సునీల్ రెడ్డి, హర్ష, సురేష్ సర్దార్, శ్యామ్ రెడ్డి, అక్షర, హర్షిత పాల్గొన్నారు

కళాకారులకు చేదోడు వాదోడు

ఎపి 'మా' అధ్యక్షుడు దాడి సత్యనారాయణ

సమావేశంలో మాట్లాడుతున్న ఏపీ మా అధ్యక్షులు దాడి సత్యనారాయణ

ప్రజాశక్తి -ములగాడ : కళాకారుల అభివృద్ధి, వారి సంక్షేమానికి చేదోడువాదోడుగా ఉంటాననిఎపి 'మా' నూతన అధ్యక్షులు, మాజీ డిప్యూటీ మేయర్ దాడి సత్యనారాయణ అన్నారు, బుధవారం సింధూర గెస్ట్ హౌస్‌లో ఆంధ్రప్రదేశ్ మూవీ ఆర్టిస్ట్ అసోసియేషన్(మా) సర్వసభ్య సమావేశం నిర్వహించారు.పాత కమిటీ గడువు ముగియడంతో నూతన కమిటీ ఎన్నికలు జరిగాయి. ఈ ఎన్నికల్లో మ అధ్యక్షునిగా దాడి సత్యనారాయణ, మిగతా పాలకవర్గ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

ఈ సందర్భంగా సత్యనారాయణ మాట్లాడుతూ, విశాఖ పరిసర ప్రాంతాల్లో ఏ షూటింగ్ జరిగినా స్థానిక కళాకారులకు అవకాశం కల్పించేందుకు సహకరిస్తానన్నారు. చాలామంది కళాకారులు దిగువ స్థాయిలో ఉన్నారని, వారిని ఆదుకునే బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. కళాకారుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషిచేస్తానన్నారు.సంఘంలో వివిధ విభాగాలను అభివృద్ధి చేసి, 'మా'ను ఆర్థికంగా పరిపుష్టి చేసేందుకు కృషి చేస్తానని వెల్లడించారు. అనంతరం ఎపి 'మా' ఆధ్వర్యంలో కళాకారుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ కలెక్టర్‌కు వినతిపత్రం ఇవ్వనున్నట్లు వెల్లడించారు. అనంతరం సంఘానికి తనవంతుగా రూ.25వేలు ఆర్థికసాయం అందించగా, మరికొంత మంది కళాకారులు ఆర్థికసాయం చేశారు. కార్యక్రమంలో వర్రె నాంచారయ్య, ఎఎం.ప్రసాద్, తేజ, వెంకట్‌రెడ్డి, కిషోర్, వెంకట్, శివజ్యోతి, పండా పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన

ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ రఘురాం

ప్రజాశక్తి -ఆనందపురం: రోడ్డు భద్రతా నియమాలు కచ్చితంగా పాటిస్తే, అధికశాతం ప్రమాదాలను నివారించవచ్చునని ఆనందపురం ట్రాఫిక్ ఎస్ఐ రఘురాం అన్నారు. బుధవారం పాలవలస గ్రామంలో ట్రాఫిక్ నిబంధనలపై ప్రజలకు అవగాహన కల్పించారు. వాహనంతో రోడ్డెక్కితే సురక్షిత ప్రయాణానికి ఎవరికివారే రహదారి భద్రతా నియమాలు పాటించాలన్నారు. బైకిస్టులు విధిగా హెల్మెట్ ధరించాలని, మద్యం మత్తులో వాహనం నడపడం, ట్రిపుల్ డ్రైవింగ్, సెల్‌ఫోన్‌లో మాట్లాడుతూ వాహనాలు నడపడం, స్పీడ్, ర్యాష్ డ్రైవింగ్ చేయకపోవడం ద్వారా అధిక ప్రమాదాలు నివారించవచ్చన్నారు. డ్రైవింగ్ లైసెన్స్‌లేని మైనర్లకు వాహనాలను ఇస్తే ప్రమాదకరమని, దీనికి సంబంధిత వాహన యజమాని బాధ్యుడౌతాడని హెచ్చరించారు. ప్రతిఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తే, రోడ్డు ప్రమాదాలు జరిగే అస్కారమే ఉండదన్నారు.కార్యక్రమంలో గ్రామస్తులు, ట్రాఫిక్ సిబ్బంది పాల్గొన్నారు.